నేడు మేథో సంపత్తి హక్కులపై సెమినార్

బాలానగర్: జేఎన్‌టీయూలోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో ఒకరోజు మేథో సంపత్తి హక్కులు అన్న అంశంపై మేథో సంపత్తి హక్కుల సెల్, జేఎన్‌టీయూ హైదరాబాద్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఫ్యాకల్టీ సభ్యులు, రీసెర్చ్ స్కాలర్‌లో కోసం 17 శనివారం ఉదయం 10 గంటలకు సెమినార్ ఉంటుందన్నారు. మేథో సంపత్తి హక్కుల సెల్ నోడల్ అధికారి డా. జే. సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌లో అంతర్జాతీయ మేథో సంపత్తి చట్టాలు, అభివృద్ధి చెందుతున్న పోకడలు, సవాళ్లు, యూనివర్సిటీలు, అకడమిక్ పేటెంట్లలో మేథో సంపత్తి హక్కులు, పేటెంట్ డ్రాఫ్టింగ్, ఫైలింగ్, మేనేజ్‌మెంట్ అంశాలపై ఈ సదస్సు ఉంటుందని తెలిపారు.

నేడు వైజ్ఞానిక ప్రదర్శన

కూకట్‌పల్లి: రవీంద్రభారతి హైదర్‌నగర్ బ్రాంచ్‌లో ఈనెల 17వ తేదీన వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రియదర్శి ని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూ ఏవీ సుబ్బారావు, ఇక్రిశాట్ అనిల్, శోభన్‌లు విచ్చేయుచున్నారని పేర్కొన్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతి ఒక్కరూ పాల్గొని చిన్నారుల ప్రతిభా పాటవాలను అభినందించాలని కోరారు.

రేపు శ్రీవివేకానందనగర్ సర్వసభ్య సమావేశం

మోతీనగర్: శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం 18వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి 12గంటల వరకు కమిటీహాల్‌లో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు రోణంకి జగన్నాథం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సహాయ సహకారాలతో గత ఏడేళ్లుగా కాలనీని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. కొన్ని విషయాల్లో విభేదాల కారణంగా కాలనీ సభ్యులు ఇన్ని రోజులు సమావేశం నిర్వహించలేదన్నారు. పెద్దల సమావేశం అనంతరం కాలనీ సంక్షేమ సంఘం సమావేశం నిర్ణయించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం జరగనున్న సమావేశంలో సంక్షేమ సంఘం విధివిధానాలు, భవిష్యత్‌లో మనం అనుసరించవలసిన విధి విధానాలను చర్చించి సంక్షేమ సంఘం ఎన్నికలు సజావుగా జరిపించటానికి, ఈ సమావేశంలో తీర్మానం చేయడానికి ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

- భారత్ బంద్ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు
- నియోజకవర్గంలో నిరసన తెలిపిన కార్మికులు

బాలానగర్: కార్మిక వ్యతిరేక చట్టాను తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించుతామని రాష్ట్ర నాయకులు యేసు రత్నం, సీఐటీయూ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్‌లు పేర్కొన్నారు. శుక్రవారం బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారత్ బంద్ సందర్భంగా 600 మందితో కార్మికులతో భారీఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా చేయడమే కనీస వేతనాలను నిర్ణయించే విధానానికి స్వస్తి పలికారన్నారు. కార్మికులకు రూ.12 వేల పని విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

- వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్‌ను తగ్గిస్తూ ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తుందన్నారు. ఈ సమ్మెతో నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకొని ప్రతి ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.
- అదే విధంగా అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ, ఫీల్డ్ అసిస్టెంట్స్, కస్తూర్బా, ఎన్‌ఆర్‌హెచ్ లాంటి స్కీమ్ వర్కర్లకు చట్టపరమైన కనీస వేతనాలు రూ.26వేలు చెల్లించాలనారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మాజీ రాష్ట్ర నాయకులు వి. వెంకట నరసయ్య, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి చైతన్య రెడ్డి, ట్రాన్స్‌పోర్టు రంగం మండల కార్యదర్శి పి.శంకర్, ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి. కార్తిక్, రమణ మానిక, పుష్ప, జైతున్, సంగీత, లక్ష్మీ, పాల్గొన్నారు.



బాలానగర్‌లో కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి: సీఐటీయూ నేత కృష్ణానాయక్

కూకట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని.. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై కార్మిక, కిసాన్ మోర్చా సంయుక్తంగా నిర్వహించిన భారత్ బంద్‌లో కార్మికులు పాల్గొని విజయవంతం చేశారని సీఐటీయూ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు భారత్ బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం వచ్చి పదేళ్లయినా రైతాంగ, కార్మిక వర్గాల సమస్యలను పరిష్కరించలేదన్నారు. శ్రామికుల నిజవేతనం 20 శాతం తగ్గిందన్నారు. భారతదేశ సంపదను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని అన్నారు.

- సింగరేణి గనుల్లో నాలుగు బొగ్గు గనులను వేలం వేయడానికి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కార్మికులు తిప్ప కొట్టాలని పిలుపునిచ్చారు. ఎందరో ప్రాణ త్యాగాల ఫలితంతో 8 పనిదినాలను సాధించుకున్న కార్మికులు మళ్లీ 12గంటల పని దినాలను అమలు చేసే విధంగా బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దీనిని కార్మికులు తిప్ప కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రశాంతినగర్ కార్మికులు వీధుల్లో ర్యాలీని నిర్వహించారు. అనంతరం జేఎన్‌టీయూ, కూకట్‌పల్లి ఆటో స్టాండ్‌ల వద్ద బీసీడబ్ల్యూ అడ్డాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకలు ఎం.శంకర్, రాజులు, రామేశ్వరరావు, సీఐటీయూ మండల నాయకులు రాములు, నరసింహ, లాజరు, ఆటో యూనియన్ నాయకులు అర్జున్, భీమ్ రాజ్, యాకయ్య, సుధాకర్, తదితరులు పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు.



భారత్ బంద్‌లో పాల్గొన్న కూకట్‌పల్లి సీఐటీయూ నాయకులు, కార్మికులు

వాటర్ ప్లాంట్, ట్యాంకర్ల సీజ్



మోతీనగర్: వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్, వాటర్ ట్యాంకర్లను శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ సీజ్ చేశారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దర్‌నగర్, యూసుఫ్‌నగర్‌లలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్, ట్యాంకర్లను సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవికాలంలో అనధికారికంగా నిర్వహిస్తున్న వారు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని సీనియర్ బీఆర్ఎస్ కార్యకర్త దుర్గేష్ శేరిలింగంపల్లి ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వి.జగదీశ్వర్‌గౌడ్ శుక్రవారం దుర్గేష్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



రథ సప్తమి శోభ



దేవాలయాల్లో సరస్వతిదేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవార్లు

మోతీనగర్: రథ సప్తమిని పురస్కరించుకొని శుక్రవారం అల్లాపూర్, మూసాపేట డివిజన్లలోని పలు దేవాలయాల్లో సరస్వతిదేవి రూపంలో అమ్మవార్లను అలంకరించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి దేవాలయాలకు తరలి వెళ్లారు. కొంతమంది అక్షరభ్యాసాన్ని సైతం తమ పిల్లలకు చేపట్టారు. అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లోని శ్రీ పర్వతవర్ధిని శివాలయంలో భక్తులకు సరస్వతిదేవి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌లో శివరామాంజనేయ దేవాలయంలో రథ సప్తమి వేడుకలు నిర్వహించారు.

బబ్బుగూడలోని సమస్యలను పరిష్కరిస్తా

మూసాపేట: మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును శుక్రవారం కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పరిశీలించారు. అనంతరం మిత్రులు, బస్తీ అధ్యక్షులతో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన విషయాన్ని వారికి తెలిపి వాటి పనితీరును ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు. అనంతరం బస్తీలో సమస్యలపై ఆరాతీశారు. ఎటువంటి సమస్యలు ఉన్నా పార్టీలకతీతంగా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కరెంటు, నాలా రోడ్డు వెడల్పు, డ్రైనేజీ లైన్ సమస్య, మంచినీటి సమస్య, పాఠశాలల్లో విద్యార్థులకు మూత్రశాలల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలన్నిటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు బోడ శ్రీను, జనరల్ సెక్రటరీ మైలారం ఆంజనేయులు, బీజేపీ నాయకులు ఎర్రస్వామి, శ్రీధర్‌గౌడ్, బస్తీ సభ్యులు మణి, చిన్న, వెంకటేష్, సుందర్‌రావు, ఎండి కబీర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి

మోతీనగర్: ప్రతి ఒక్కరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్ వి.రామారావునగర్‌లో శుక్రవారం ఏజీఐ గ్రీన్ ప్యాక్, ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ, వి.రామారావునగర్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు మౌనికా రెడ్డి, బసవయ్యలు వైద్య పరీక్షలు చేశారు. మధుమేహం, బీపీ, నేత, దంత, కళ్ల, ముక్కు, చర్మ వ్యాధులు, గొంతు, కీల్లు, మోకాళ్లతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ సిబ్బంది, నాయుడు, శ్రీనివాస్, అఖిల్, వి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మోతీనగర్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజీవ్‌గాంధీ నగర్ చౌరస్తాలో సఫ్దర్‌నగర్ సెక్టార్ ఎస్సై మాల్యానాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు బహుమతి వచ్చిందని ఫోన్లు చేస్తే స్పందించవద్దని సూచించారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ తమ తమ ఫోన్‌లలో వచ్చే మెసేజ్‌లను ఒకటికి రెండు సార్లు చదువుకొని అవసరమనుకుంటేనే సమాధానం ఇవ్వాలన్నారు. లేకపోతే వాటిని డిలీట్ చేయాలని సూచించారు. అదే విధంగా వివిధ రకాల లింక్‌లను పంపి తమ అకౌంట్‌లో నుంచి డబ్బులు కాజేసే అవకాశాలు ఉన్నాయని అన్నారు. తెలియని అటువంటి లింక్‌లను ఎటువంటి పరిస్థితిలో ఓపెన్ చేయవద్దని తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో జెడ్‌సీ పర్యటన

- మ్యాన్‌హోల్, కాచ్‌పిట్‌ల దగ్గర ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశం
- జోనల్ పరిధిలోని చెరువులు, నాలాల పరిశీలన


అధికారులకు సూచనలు చేస్తున్న జెడ్‌సీ అభిలాష అభినవ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వరద ముంపు ప్రాంతాలను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కాముని చెరువు నాలా, సఫ్దర్‌నగర్, రాజీవ్ నగర్ నాలా, సున్నం చెరువు, ముళ్లకత్వ చెరువు వెంబడి ఉన్న అంబేద్కర్‌కాలనీ, రాజీవ్ గృహకల్ప ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ముందస్తు ప్రణాళిక ప్రకారం సంబంధిత అధికారులకు పలు సూచనలను అందజేశారు. నాలాలో ఉన్న అడ్డంకులు వెంటనే తొలగించాలని ఆదేశించారు.

- ముందస్తు ప్రణాళిక ప్రకారం మ్యాన్‌హోల్, కాచ్‌పిట్‌ల దగ్గర ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. వాటిని తెరవకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే పూడికతీత పనులు పూర్తి చెయ్యడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పునరావాస స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాలలోని పనులు, నీటి నిల్వ ప్రాంతాల్లో మరమ్మతులు, నాలాల నిర్మాణ పనులు పూర్తి చేసి రాబోయే వర్షాకాలంలో వరద ముంపునకు గురి కాకుండా చూడాలని ఆదేశించారు.
- అసంపూర్తిగా ఉన్న వానాకాలం పనులను పూర్తి చేయాలని, రాబోయే వర్షాకాలంలో వరద ముంపుకు గురి కాకుండా చూడాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రదేశాలను గుర్తించాలని, నాలా చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రదేశాలను గుర్తించి మరిన్ని క్యాచ్ పిట్‌లను ప్రతిపాదించాలన్నారు. రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఫెన్సింగ్ లేని ప్రదేశాల్లో ప్రజలు, చిన్నారులను నాలా దగ్గరకు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.